

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు 05

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- హసన్ పర్తి వద్ద బ్లాక్ స్పాట్స్ ను వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలన



## ఆరోగ్య సంరక్షణ కోసం 5కే రన్

- నగర మేయర్ గుండు సుధారాణి
- పోచమ్మ మైదాన్ నుండి వేయిస్తంభాల ఆలయం వరకు కొనసాగిన రన్

05

సంపుటి :03 | సంచిక :31 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

సోమవారం 09, మార్చి 2026

# చట్ట పరిధిలోనే పనిచేస్తాం

## చావుకు భయపడి లొంగిపోలేదు..

02

- ప్రజాసేవకే ప్రాధాన్యం
- కొత్తదారి వెతుకులాటలో ఉన్నాం
- మాజీ మావోయిస్టు అగ్రనేత ఆశన్న కీలక ప్రకటన
- బట్టుపల్లిలో మాజీ మావోయిస్టులతో భేటీ



"మూడున్నర దశాబ్దాల అజ్ఞాత పోరాటానికి స్వస్తి పలికి జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టు పార్టీ మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న తన భవిష్యత్ కార్యాచరణపై తొలిసారి నోరు విప్పారు. చావుకు భయపడో, నిర్బంధాలకు తలవంచో తాను లొంగిపోలేదని.. ప్రజల మధ్య ఉంటూ చట్టబద్ధంగా వారి సమస్యల కోసం పోరాడాలనే లక్ష్యంతోనే ఈ కొత్త దారి ఎంచుకున్నానని ఆయన స్పష్టం చేశారు."

– అక్షర దర్బార్, హనుమకొండ

# లిక్కర్ కేసులో ట్విస్ట్



- కల్వకుంట్ల కవిత సహా 23 మందికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు
- ట్రయల్ కోర్టు ఇచ్చిన క్లీన్ చిట్‌పై న్యాయస్థానం స్టే
- సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ

02

## వేం.. సింఘ్వీ ఎన్నిక ఏకగ్రీవం

- ఇక నుంచి వారు.. రాజ్యసభ సభ్యులు
- ధ్రువపత్రాలు అందించిన రిటర్నింగ్ అధికారి
- ఢిల్లీ వేదికగా రాష్ట్ర సమస్యలపై పోరాడతామని వేం ఉద్ఘాటన

05



## ఏసీబీకి చిక్కిన ఇద్దరు ఆర్ఎస్సైలు 02

- సైబర్ కేసు తప్పించేందుకు లంచం డిమాండ్
- డబ్బులు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ



# సాగునీటికి కటకట

**అక్షరదర్బార్, వరంగల్ :**

- పాతాళానికి భూగర్భ జలాలు.. నోరెళ్లబెట్టిన బోర్లు
- ఇంకిపోయిన చెరువులు, వాగులు
- ఎండమావిలా ఎస్సారెస్పీ, కాళేశ్వరం జలాలు
- పంట చేతికొచ్చే దశలో సాగునీటి ఎద్దడి
- మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో దయనీయ పరిస్థితులు
- కన్నీరు పెడుతున్న అన్నదాతలు
- యంత్రాంగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వేడుకోలు

**అక్షర దర్బార్, ప్రతినిధి :**

మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో ప్రస్తుత సాగునీటి సంక్షోభం నెలకొంది. ఆరుగాలం శ్రమపడి రైతులు పండించిన పంటలు వాడు దశకు చేరుకున్నాయి. ఎండల తీవ్రత పెరగడం, భూగర్భ జలాలు పాతాళానికి పడిపోవడం నీటిఎద్దడికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. కాల్వల ద్వారా నీటి సరఫరా



దేవరుప్పుల మండలం మల్యా తండాలో నీళ్లు లేక ఎండిన పంటలను చూపుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు

నిలిచిపోవడంతో చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. దీనివల్ల బోర్లలో నీటి మట్టం తగ్గిపోయి పొట్ట దశలో ఉన్న వరి, మక్కజొన్న పంటలకు నీరు అందడం లేదు. గతంలో ప్రాజెక్టుల నుంచి నిరంతరాయంగా నీరు అందడం వల్ల రైతులు ధైర్యంగా సాగు చేసేవారు. ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో సాగునీటి నిర్వహణ లోపించడం, కాల్వల్లో పూడిక పేరుకుపోవడం వల్ల చివరి ఆయకట్టు వరకు నీరు చేరడం లేదు. ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించకపోవడం వల్ల రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

**- నీరు రాకపోవడంతో ఇబ్బందులు**

జనగామ జిల్లాలో దేవాదుల నీటిపై ఆధారపడిన రైతులు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్ ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి చెన్నూరు కాల్వకు నీరు విడుదల చేయకపోవడం వల్ల సాగు భూములు నెర్రెలు వారుతున్నాయి. అదేవిధంగా మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్, నర్సింహులపేట మండలాల్లో ఎస్సారెస్పీ కాల్వల ద్వారా కాళేశ్వరం జలాలు రాకపోవడంతో మున్నేరు, ఆకేరు వాగుల పరివాహక ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం, చెరువులు నింపే చర్యలు చేపట్టకపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి నీరు పారే పరిస్థితి లేకపోయినా అధికారులు పూడికతీత పనులు చేపట్టకపోవడం ఈ విపత్కర పరిస్థితికి దారితీసింది.

**- పరిష్కార మార్గాలు**

పంటలు పూర్తిగా ఎండిపోకముందే ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. తక్షణమే దేవాదుల, ఎస్సారెస్పీ కాల్వల నుంచి సాగు నీటిని విడుదల చేసి గ్రామాల్లోని చెరువులు, కుంటలను నింపాలి. కాల్వల వెంట పేరుకుపోయిన పూడికను తొలగించి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి వారం వారం కాల్వల ద్వారా తడులు ఇప్పించినట్లయితే చివరి దశలో ఉన్న పంటలు గట్టెక్కుతాయి. రైతులకు పెట్టుబడి సాయం అందజేయడంతో పాటు పంట నష్టపోయిన వారిని ఆదుకోవడానికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలి. సాగునీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తేనే అన్నదాతను ఆత్మహత్యల నుంచి, ఆర్థిక నష్టాల నుంచి కాపాడటం సాధ్యమవుతుంది.

## పంట చేతికొచ్చే సమయానికి బోర్లు వట్టిపోయినయ్

జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని లకావత్ తండాలో రెండెకరాల్లో వరి సాగు చేసిన. పంట చేతికొచ్చే సమయానికి బోర్లు వట్టిపోయినయి. ఎకరా పొలం ఎండిపోయింది. పసుగాసానికి కూడా పనికిరాదని భావించి, ఎండిన ఆ పొలాన్ని వెయ్యి రూపాయలకు గొర్రెల కాపరికి మేతగా అమ్మేసిన. కనీసం పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. దేవాదుల నీళ్లు వదిలితేనే మిగిలిన పంటనైనా కాపాడుకోగలం.

**– ధారవత్ రమేష్, రైతు**

## ఈ సారి కాలువలు రాకనే సాగు నీటికి ఇబ్బంది

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో సాగు నీరు లేక పంటలన్నీ ఎండిపోతున్నాయి. గతంలో రెండో పంటకు కూడా నీళ్లు పుష్కలంగా ఉండేవి. ఈసారి కాలువలు రాక, చెరువులు నిండక పరిస్థితి దారుణంగా మారింది. పంటను కాపాడుకోవాలని ఇరవై వేల రూపాయలు ఖర్చు చేసి క్రేన్‌తో బావి తీయించినా చుక్క నీరు పడలేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి కాలువల ద్వారా నీళ్లు వదలకపోతే ఆశలు వదులుకోవాల్సిందే.

**– గుగులోత్ భూక్యా నాయక్, రైతు**

# చట్ట పరిధిలోనే పనిచేస్తాం

- చావుకు భయపడి లొంగిపోలేదు..
- ప్రజాసేవకే ప్రాధాన్యం
- కొత్తదారి వెతుకులాటలో ఉన్నాం
- మాజీ మావోయిస్టు అగ్రనేత ఆశన్న కీలక ప్రకటన
- భట్టుపల్లిలో మాజీ మావోయిస్టులతో భేటీ

అక్షరదర్బార్, హనుమకొండ : చట్ట పరిధిలోనే పనిచేస్తామని, తాము చావుకు భయపడి లొంగిపోలేదని, ప్రజాసేవకే ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో కొత్తదారి వెతుకులాటలో ఉన్నామని మావోయిస్టు పార్టీ మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కెళ్లపల్లి వాసుదేవరావు (ఆశన్న) స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా భట్టుపల్లిలో మాజీ మావోయిస్టులు, అమరవీరుల కుటుంబ సభ్యులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము చావుకు భయపడి లొంగిపోయామనే ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా, చట్టం పరిధిలో ఉండి ప్రజల కోసం పనిచేయాలనే ఉద్దేశంతోనే అజ్ఞాత జీవితం నుంచి బయటకు వచ్చామని తెలిపారు. అన్నీ ఆలోచించి, కేంద్ర కమిటీకి ముందే సమాచారం ఇచ్చి ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన వివరించారు. దాదాపు మూడున్నర దశాబ్దాల పాటు దండకారణ్యంలో ఆదివాసీల హక్కుల కోసం పోరాడామని ఆశన్న గుర్తు చేసుకున్నారు. పదేళ్ల క్రితం పార్టీ బలంగా ఉన్నప్పుడే ప్రభుత్వాలతో చర్చలు జరిపి లొంగుబాటు నిర్ణయం తీసుకుని ఉంటే ఇంతమంది అమరులయ్యేవారు కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం పార్టీ బలహీనపడటంతో పాటు నిర్బంధాలు పెరగడం వల్ల ప్రజల మధ్యకు వచ్చి పనిచేయడమే సరైన మార్గమని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తాము ఎక్కడికీ పారిపోమని, ప్రజల మధ్యే ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ప్రస్తుతానికి ఏ రాజకీయ పార్టీలో చేరాలనే ఆలోచన తమకు లేదని ఆశన్న స్పష్టం చేశారు. సమాజంలో సమస్యలు ఇంకా ఉన్నాయని, వాటిని పరిష్కరించడానికి ఒక వర్గానికో లేదా కులానికో పరిమితం కాకుండా అందరినీ కలుపుకొని వెళ్తామని చెప్పారు. తమపై వస్తున్న ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు. ప్రతికూల పరిస్థితుల నుంచి కొత్తదారిని వెతుక్కునే ప్రయత్నంలో ఉన్నామని, అందరితో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. తన విప్లవ ప్రయాణానికి పురిటిగడ్డ అయిన బట్టుపల్లితో తనకు విడదీయని అనుబంధం ఉందని ఆశన్న ఈ సందర్భంగా ఉద్వేగంగా పేర్కొన్నారు.

# లిక్కర్ కేసులో ట్విస్ట్

- కల్వకుంట్ల కవిత సహా 23 మందికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు
- ట్రయల్ కోర్టు ఇచ్చిన క్లీన్ చిట్ పై న్యాయస్థానం స్టే
- సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ



**అక్షరదర్బార్, హైదరాబాద్ :**

ఢిల్లీ మద్యం విధానం కేసులో అనూహ్య పరిణామం సంభవించింది. ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, కల్వకుంట్ల కవిత సహా 23 మందికి రౌస్ ఎవెన్యూ కోర్టు ఇచ్చిన క్లీన్ చిట్‌ను సవాల్ చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన హైకోర్టు.. ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించింది. ఈ కేసులో కుట్ర కోణాన్ని అంచనా వేయడంలో ప్రత్యేక కోర్టు పొరబడిందని, విడివిడి అంశాలుగా పరిగణించడం వల్ల కేసు నీరుగారిందని సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ఢిల్లీ హైకోర్టు.. కేజ్రీవాల్, కవిత సహా 23 మంది ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌కు కౌంటర్ దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. అలాగే, ఈ పిటిషన్‌పై విచారణ ముగిసే వరకు ఈడీ కేసులో ట్రయల్ కోర్టు విచారణను వాయిదా వేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఈనెల 16కు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. దర్యాప్తు సంస్థల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్న ట్రయల్ కోర్టు వ్యాఖ్యలను హైకోర్టు ప్రస్తుతానికి నిలిపివేసింది.



## నూతన వధూవరులకు ఆశీర్వాదం

అక్షర దర్బార్, సంగెం: ఆత్మకూరు మండలం చౌళ్ళపల్లి (ఒగోనిపల్లి) గ్రామానికి చెందిన ఆవుల లలిత–రవీందర్ దంపతుల కుమారుడు నవీన్ వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు డా. పగడాల కాళీ ప్రసాద్ రావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో చౌళ్ళపల్లి గ్రామ సర్పంచ్ మోరె రాజేశ్వర రావు, మండల ప్రధాన కార్యదర్శి రవ్వ శివప్రసాద్, దామెరుపుల చంద్రమౌళి, ఆర్టీఐ యాక్ట్ జిల్లా కన్వీనర్ ఎదులపురం శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షులు పూజారి రవి, వార్డ్ మెంబర్ కుక్కముడి కిరణ్, యదా కుమార్, రాచర్ల నరేష్, ఆవుల వెంకన్న, ఆవుల సాంబయ్య పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన ఇద్దరు ఆర్ఎస్సైలు

- సైబర్ కేసు తప్పించేందుకు లంచం డిమాండ్
- డబ్బులు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ



అక్షరదర్బార్, మేడ్చల్ : మేడ్చల్ మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీ నగర్ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు అధికారులు ఏసీబీ వలకు చిక్కారు. ఒక సైబర్ క్రైమ్ కేసులో నిందితుడిని అరెస్టు చేయకుండా ఉండడానికి ఫిర్యాదుదారుడి నుంచి ఆర్ఎస్సైలు ప్రమోద్ గౌడ్, జటావత్ బాబు నాయక్ భారీగా లంచం డిమాండ్ చేశారు. బాధితుడి నుంచి రూ.లక్ష తీసుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్న ఈ అధికారులు చివరకు అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. సోమవారం ఎల్‌బీనగర్ చౌరస్తాలో ఎస్సై జటావత్ బాబునాయక్ బాధితుడి నుంచి రూ.లక్షే నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేశారు. లంచం డబ్బును స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న ప్రమోద్ గౌడ్, బాబు నాయక్ ఇద్దరినీ ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన అధికారులను అరెస్టు చేసి నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ప్రభుత్వ ఉద్యోగులు లేదా అధికారులు ఎవరైనా తమ విధుల నిర్వహణలో లంచం డిమాండ్ చేస్తే వెనుకాడకుండా ఫిర్యాదు చేయాలని ఏసీబీ శాఖ ప్రజలకు సూచించింది. అవినీతికి పాల్పడే ప్రభుత్వ అధికారుల, సిబ్బంది సమాచారాన్ని 1064 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరింది. అలాగే 9440446106 అనే వాట్సప్ నంబర్ ద్వారా కూడా సోషల్ మీడియా వేదికగా ఫిర్యాదులు పంపవచ్చని సూచించింది.

# సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

## –టీఎస్ఎస్ యూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల వేణు






అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: రాష్ట్రంలోని విద్యాశాఖ పరిధిలో గత 19 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని తెలంగాణ సమగ్ర శిక్ష్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల వేణు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మూడు దశల పోరాటంలో భాగంగా యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం భోజన విరామ సమయంలో మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్ల రిబ్బన్ ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ 29 రోజుల సమ్మె కాలపు వేతనాన్ని వెంటనే చెల్లించాలని, క్రమబద్ధీకరణ జరిగే వరకు పే స్కేలు ప్రకారం వేతనాలు ఇవ్వాలని, నగదు రహిత ఆరోగ్య కార్డులు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 16న జిల్లా, డివిజన్ స్థాయి నిరసనలు, 20న చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు బట్టల సదయ్య, ఆరెల్లి చంద్రమౌళి, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### కేజీబీవీలో..

అక్షర దర్బార్, చిట్యాల, మార్చి 9: ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ సోమవారం చిట్యాల కేజీబీవీలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షుడు పెద్దపల్లి యోగానంద చారి మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన 29 రోజుల సమ్మె కాలపు వేతనాన్ని వెంటనే చెల్లించాలని, మినిమం టైమ్ స్కేలు ప్రకారం వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 16న నిర్వహించే జిల్లా, డివిజన్ స్థాయి నిరసనలకు, 20న జరిగే చలో అసెంబ్లీ కార్యక్రమానికి ఉద్యోగులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ సుమలత, ఉపాధ్యాయ బృందం, సమగ్ర శిక్ష ఉద్యోగులు, టీఎస్ యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



# ముస్త్యాలపల్లికి బస్సు దారి సుగమం

## రోడ్డుపై గుంతలు పూడ్చించిన సర్పంచ్ వెంకటేష్

అక్షర దర్బార్, నడికూడ: మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేందుకు సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ చర్యలు చేపట్టారు. ఆర్టీసీ బస్సు రాకపోకలకు అనువుగా ఉండేందుకు రహదారిపై ఉన్న గుంతలను పూడ్చి రోడ్డును చదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చాలా కాలంగా బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, మహిళలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ఆర్టీసీ పరకాల డిపో అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి పలు సూచనలు చేసినట్లు చెప్పారు. బస్సు ప్రయాణానికి ఆటంకం కలగకుండా రహదారి పక్కనున్న చెట్ల కొమ్మలను కూడా తొలగించామని తెలిపారు. పరకాల–చౌటుప్పర్తి–ముస్త్యాలపల్లి మార్గంగా హనుమకొండకు బస్సు నడిచేలా రహదారిని సిద్ధం చేసినట్లు వివరించారు. గ్రామానికి బస్సు సౌకర్యం రానుండటంతో గ్రామస్థులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



# నాగుర్లను కలిసిన ఆరెకుల సంక్షేమ సంఘం సభ్యులు

దుగ్గొండి, అక్షర దర్బార్: ఆరె కుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వరరావును సోమవారం వరంగల్ జిల్లా సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షుడు ఓలిగే నర్సింగరావు ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగుర్ల వెంకటేశ్వరరావును శాలువాతో సత్కరించి పూల బొకేతో అభినందించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుకినే రాజేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివాజీ, జిల్లా గౌరవ అధ్యక్షుడు గుండెకారి రవికుమార్, ఉపాధ్యక్షుడు లాండే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలపై అవగాహన



అక్షర దర్బార్, చిట్యాల : మండలంలోని రామచంద్రాపూర్, కైలాపూర్ గ్రామ శివారులో జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఏ. సునీల్ కుమార్ మాట్లాడుతూ కూరగాయలు, పండ్ల తోటలు, నూనె తాటి వంటి ఉద్యాన పంటల సాగు ద్వారా రైతులు తక్కువ భూమిలోనే మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. నీటి పొదుపు పద్ధతులు పాటించడం ద్వారా పంటల ఉత్పత్తి కూడా పెరుగుతుందని వివరించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా రైతులకు అందే ప్రోత్సాహకాలు, సబ్సిడీల గురించి వివరించి ఉద్యాన పంటల సాగు వైపు రైతులు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి రామాచారి, రామచంద్రాపూర్ సర్పంచ్, గా జే హేమలత– అశోక్, ఆయిల్ పామ్ ఇన్‌చార్జ్ వాసు, ఫినోలెక్స్ కంపెనీ ప్రతినిధి శ్యాం కుమార్, రైతులు వల్లకొండ లింగారెడ్డి, సమ్మిరెడ్డి, గంపల రమేష్, మధుకర్, సతీష్, ఆయిల్ పామ్ మండల ప్రతినిధులు సాయి, ప్రీతం తదితరులు పాల్గొన్నారు.

# ఈజీఎస్ పనులకు గ్రామ సిబ్బంది

అక్షర దర్బార్, నడికూడ: మండలంలోని చర్లపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ సిబ్బందిని ఈజీఎస్ పనులకు వినియోగిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో గ్రామ పారిశుద్ధ్యం నిర్లక్ష్యానికి గురవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ ఆవరణలో నిర్మిస్తున్న పబ్లిక్ టాయిలెట్ పనులకు కూలీలను నియమించాల్సి ఉండగా పారిశుద్ధ్య కార్మికులను ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఈజీఎస్ పనులకు ప్రత్యేక నిధులు ఉన్నప్పటికీ గ్రామ సిబ్బందిని ఎందుకు వినియోగిస్తున్నారో స్పష్టత లేదని, ఆ పనులకు వచ్చే డబ్బులు ఎవరికి వెళ్తున్నాయోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

### సిబ్బందిని ప్రైవేట్ పనులకు వాడొద్దు: ఎంపీడీఓ



గ్రామపంచాయతీ సిబ్బందిని ప్రైవేట్ పనులకు వినియోగించరాదని నడికూడ ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. ఫిర్యాదులపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.



# కో-ఆప్షన్ సభ్యురాలిగా సేవలందించిన ఫాతిమా హమీద్



అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీలో కో–ఆప్షన్ సభ్యురాలిగా పనిచేసిన ముఫీనా ఫాతిమా హమీద్ ప్రజా సేవలో తనదైన ముద్ర వేశారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి యువతకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ఆమెను 25 ఏళ్ల వయసులోనే కో–ఆప్షన్ సభ్యురాలిగా నియమించారు. తన పదవీకాలంలో ఫాతిమా హమీద్ రాజకీయ, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరేలా కృషి చేశారు. ఎన్నికల సమయంలో పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి నాయకత్వం ప్రశంసలు అందుకున్నారు. అలాగే ఖబర్‌స్తాన్‌లో సీసీ రోడ్డు నిర్మాణం, షాదీఖానా, ఆశూర్‌ఖానా మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేశారు. కరోనా సమయంలో పేదలకు సహాయం అందిస్తూ పలు సేవా సంస్థల నుంచి పురస్కారాలు అందుకున్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత సేవ చేయాలని ఫాతిమా హమీద్ ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు




అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పదవ తరగతి టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పరకాల ఎస్ఐ పవన్ కుమార్, ఎస్వీ కళాశాల చైర్మన్ సిరికొండ శ్రీనివాస్ చారి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. టాలెంట్ టెస్ట్‌లో శారద హైస్కూల్ విద్యార్థిని డి. సిరివెన్నెల మొదటి బహుమతి, ఎస్ఆర్ స్కూల్‌కు చెందిన ఉత్తమ్ శెట్టి రెండో బహుమతి సాధించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రభుత్వ బాలికల పాఠశాలకు చెందిన పి. అక్షయ మొదటి బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ హేమంత్, పాఠశాల ఇన్‌చార్జ్ కల్పనా, పద్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# మానుకోటలో 11న జాబ్ మేళా

**ఫ్లిప్ కార్ట్ లో డెలివరీ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు అవకాశం**

అక్షరదర్బార్, మహబూబాబాద్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 11న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి టి. రజిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఈ–కామర్స్ సంస్థ ఫ్లిప్ కార్టుకు అనుబంధంగా పనిచేస్తున్న ఇన్‌స్టాకార్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో డెలివరీ ఎగ్జిక్యూటివ్ / విష్ మాస్టర్ పోస్టుల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు జాబ్ మేళా ప్రారంభం కానుందని తెలిపారు. పదో తరగతి లేదా అంతకంటే పై చదువు పూర్తి చేసి, 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల పురుష అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అభ్యర్థులు సొంతంగా బైక్, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, స్మార్ట్ ఫోన్ తప్పనిసరిగా కలిగి ఉండాలి. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికేట్లు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, బ్యాంక్ ఖాతా వివరాల జిరాక్స్ ప్రతులతో జాబ్ మేళాకు హాజరుకావాలని అధికారులు సూచించారు.

# పీపీవీలను ప్రజలకు అందుబాటులోకి తేవాలి

**–ఎంపీడీఓ జి. కిషన్**

అక్షరదర్బార్, రాయపర్తి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు (పీపీవీ)లను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రాయపర్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. కిషన్ సూచించారు. 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం ఆయన రాయపర్తి గ్రామంలోని పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి, పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం వహించరాదని, ప్రతిరోజూ పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాష్, రాయపర్తి గ్రామ సర్పంచి సహేంద్ర బిక్షపతి, పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం

# విజయవంతం చేయాలి

అక్షర దర్బార్, చిట్యాల : సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా రేపు చిట్యాల మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పుల్ల మల్లయ్య కోరారు. కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు జన్నె యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.




## రెండేళ్లలోనే

# చారిత్రాత్మక అభివృద్ధి

- రూ. 5,257 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి పరిపాలన అనుమతులు
- మామునూరు ఎయిర్ పోర్ట్, మాస్టర్ ప్లాన్ తో త్రినగరి అభివృద్ధికి బాటలు
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు.. బాణాసంచా పేల్చి హర్షం

అక్షరదర్బార్, హనుమకొండ : ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖచిత్రాన్ని మార్చే అతిపెద్ద మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్ 'అండర్ గ్రౌండ్ డ్రైనేజీ' (యూజీడీ) కి మోక్షం లభించిందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరంగల్ నగరాభివృద్ధిలో ఇదొక చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. గత పాలకులు కేవలం మాటలకే పరిమితం చేసిన యూజీడీ ప్రాజెక్టును, కాంగ్రెస్ ప్రభుత్వం చేతల్లో చూపిందని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. రూ.5257.20 కోట్లను కేటాయిస్తూ ప్రభుత్వం జీఓ నెంబర్ 322 ద్వారా పరిపాలన అనుమతులు మంజూరు చేసిందని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో ప్రముఖ సంస్థ ద్వారా ఇప్పటికే డీపీఆర్ సిద్ధం చేశామని, పనులు పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

**- విమర్శలపై ఘాటు స్పందన**

అభివృద్ధి జరుగుతుంటే ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని నాయిని మండిపడ్డారు. "ఊర్లో పెళ్లికి కుక్కల అరుపులు అన్నట్లుగా ప్రతిపక్షాల తీరు ఉంది. గత పదేళ్లలో వారు చేయలేని పనులను, మేము రెండేళ్లలోనే చేసి చూపిస్తున్నాం. అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?" అని ఆయన సవాల్ విసిరారు. కమిషన్ల కోసం పనులు ఆలస్యం చేసే సంస్కృతి తమది కాదని, ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తున్నామని నాయిని తెలిపారు. మామునూరు ఎయిర్ పోర్ట్ భూసేకరణ కోసం రూ.309 కోట్లు కేటాయించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని, వరంగల్ త్రినగరి అభివృద్ధికి కొత్త మాస్టర్ ప్లాన్ అమలుకు కట్టుబడి ఉన్నామని రాజేందర్ రెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తదితరు లు పాల్గొని, ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సీఎం, మంత్రుల సహకారం మరువలేనిదని కొనియాడారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలు జిల్లా కార్యాలయం వద్ద బాణాసంచా పేల్చి మిఠాయిలు పంపిణీ చేస్తూ సంబరాలు జరుపుకున్నారు.

# సోషల్ మీడియా రాష్ట్ర ఉత్తమ హాస్యనటుడిగా పల్లె రాములు

**కళాసేవకు గుర్తింపుగా అరుదైన గౌరవం**



అక్షర దర్బార్, నర్సంపేట: కళారంగంలో తనదైన ప్రతిభతో గుర్తింపు పొందిన పల్లె రాములు సోషల్ మీడియాలో రాష్ట్ర స్థాయి ఉత్తమ హాస్యనటుడిగా ఎంపికయ్యారు. తెలంగాణ యాస, భాషతో పల్లె జీవన విధానాలను తన ప్రత్యేక శైలిలో చూపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. తన యూట్యూబ్ చానల్ ద్వారా రూపొందిస్తున్న చిన్న చిత్రాల ద్వారా గ్రామీణ జీవన విధానాలు, సామాజిక అంశాలను హాస్యరూపంలో ప్రజలకు చేరవేస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ఈ ప్రతిభను గుర్తించిన శ్రీవివేకానంద సేవా సమితి రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారాల కార్యక్రమంలో భాగంగా పల్లె రాములకు ఈ అవార్డు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పల్లె రాములు మాట్లాడుతూ ఈ గౌరవానికి కారణం తనను ఆదరిస్తున్న తెలుగు ప్రజల ప్రేమనే అని అన్నారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, ఇకముందు కూడా తన వీడియోల ద్వారా ప్రజలను నవ్విస్తూ చైతన్యం కల్పిస్తానని తెలిపారు.

# చోరీ కేసులో ముగ్గురికి 14 రోజుల రిమాండ్

అక్షర దర్బార్, శాయంపేట: దొంగతనం కేసుల్లో కోర్టు వాయిదాలకు సరిగా హాజరుకాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. శాయంపేట ఎస్సై జె. పరమేశ్వర్ సోమవారం నాన్ బెయిలబుల్ వారెంట్‌ను అమలు చేసి కుతాటి సైదులు, నిమ్మల సంతోష్, మేకల హరికృష్ణలను అదుపులోకి తీసుకుని పరకాల కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ సాయి శరత్ ముగ్గురు నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించగా, వారిని పరకాల సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.




# సమగ్ర శిక్ష సిబ్బంది నిరసన

అక్షర దర్బార్, పరకాల : సమగ్ర శిక్ష ఉద్యోగులకు పే స్కేల్ వేతనాలు అమలు చేయడంతో పాటు గత సంవత్సరం 29 రోజుల సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పరకాల మండల విద్యా వనరుల కేంద్రం (ఎంఆర్సీ)లో సోమవారం సిబ్బంది నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో మూడు దశల పోరాటంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, డేటా ఎంట్రీ ఆపరేటర్ మహేందర్, సీఆర్‌పీలు రమేష్‌బాబు, రఘుబాబు, శ్రీలత, ఐఈఆర్‌పీ రమాదేవి, మెసెంజర్ రాధా, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు సారంగపాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలి

అక్షర దర్బార్ / ములుగు జిల్లా ప్రతినిధి: తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన రైస్ మిల్లర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి తమ సమస్యలను వివరిస్తూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మిల్లర్లు మాట్లాడుతూ రైతులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉన్న రైస్ మిల్ పరిశ్రమ గత కొన్ని సంవత్సరాలుగా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. పెరుగుతున్న ఉత్పత్తి ఖర్చులు, విద్యుత్ చార్జీలు, గోదాముల కొరత, ధాన్యం నాణ్యత సమస్యలు మిల్లర్లపై భారంగా మారాయని తెలిపారు. డిఫాల్ట్ మిల్లర్లపై విధించిన 25 శాతం పెనాల్టీ, 12 శాతం వడ్డీని మాఫీ చేసి, ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని నాలుగు వాయిదాల్లో చెల్లించేలా అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే మిల్లింగ్, ట్రాన్స్‌పోర్ట్ తదితర చార్జీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ , అసోసియేషన్ సభ్యులు, జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# వేం.. సింఘ్వీ ఎన్నిక ఏకగ్రీవం

- ఇక నుంచి వారు.. రాజ్యసభ సభ్యులు
- ధ్రువపత్రాలు అందించిన రిటర్నింగ్ అధికారి
- ఢిల్లీ వేదికగా రాష్ట్ర సమస్యలపై పోరాడతామని వేం ఉద్ఘాటన

**అక్షరదర్బార్, హైదరాబాద్ :**





తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ సభ్యులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిద్దరి ఎన్నికను ధ్రువీకరిస్తూ రిటర్నింగ్ అధికారి వారికి అధికారిక పత్రాలను అందజేశారు. ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించినందుకు వేం నరేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభ సభ్యుడిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఢిల్లీ వేదికగా రాష్ట్ర సమస్యలపై పోరాడతాం

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం పెద్దల సభలో గళం విప్పుతానని వేం నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని మీడియాకు వివరించారు. ఢిల్లీ స్థాయిలో తెలంగాణ హక్కులను కాపాడటమే తన ప్రాధాన్యతని ఆయన వెల్లడించారు. అనుభవజ్ఞులైన సభ్యులు రాజ్యసభలో అడుగుపెట్టడం రాష్ట్రానికి శుభపరిణామమని మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేస్తూ, నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండల పత్తిపాక గ్రామంలో ఎంజిఎన్ఆర్ఈజీఎస్ లో భాగంగా 10 లక్షల నిధులతో గ్రామంలోని పలు కాలనీలలో సిసి రోడ్డు నిర్మాణం పనులు సోమవారం సర్పంచ్ గజ్జి ఐలయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పని చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి రాజిరెడ్డి,పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ ప్రకాశం,రవి, భిక్షపతి,కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పాత తండాలో అభివృద్ధి పనులకు శ్రీకారం

అక్షర దర్బార్, ఇనుగుర్తి: ఇనుగుర్తి మండలం పరిధిలోని పాత తండా గ్రామంలో సోమవారం ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఇనుగుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షులు కూరెల్లి సతీష్ ప్రారంభించారు. కార్యక్రమంలో పాత తండా గ్రామ సర్పంచ్ ఇస్లావత్ నరేష్, ఉప సర్పంచ్ నరేష్, మాజీ సర్పంచ్ ఇస్లావత్ బాలు నాయక్, వార్డ్ మెంబర్లు శ్రీధర్, రాజు, లచ్చిరాం, బానోత్ వీరు, తిరుమల్, రామకోటి తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన లైసెన్స్ సర్వేయర్లు




అక్షర దర్బార్ / ములుగు జిల్లా ప్రతినిధి: ములుగు జిల్లాకు చెందిన లైసెన్స్ సర్వేయర్లు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అక్టోబర్–నవంబర్ నెలల్లో నిర్వహించిన పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు శిక్షణ ఇచ్చే సమయంలో స్పెల్–1, స్పెల్–2గా విభజించినప్పటికీ అందరికీ ఒకే విధమైన శిక్షణ, ఒకే రకమైన లైసెన్స్ ఇచ్చారని తెలిపారు. అయితే ఇటీవల 5 మార్చి 2026న స్పెల్–1లోని 34 మంది సర్వేయర్లకు మాత్రమే మండల కేటాయింపు చేయడం తమను నిరాశకు గురిచేసిందన్నారు. కాబట్టి స్పెల్–2లో ఉత్తీర్ణులైన సర్వేయర్లతో పాటు మిగతా అభ్యర్థులకు కూడా త్వరగా మండలాల కేటాయింపు చేసి వృత్తిలో స్థిరత్వం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.

# రాధికకు డాక్టరేట్




అక్షరదర్బార్, హనుమకొండ హనుమకొండ ప్రశాంత్ నగర్ కు చెందిన ఇనుగాల రాధికకు హైదరాబాదులోని చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీ డాక్టరేటును అందజేసింది. 'ఏ స్టడీ ఆన్ సేవింగ్స్ అండ్ ఇన్వెస్ట్మెంట్ ప్యాటర్న్ ఆఫ్ పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయిస్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు తెలంగాణ స్టేట్' అనే అంశంపై ప్రొఫెసర్ జి ఉష్శ్రీ పర్యవేక్షణలో పరిశోధనను పూర్తి చేసినందుకు డాక్టరేట్ అందజేశారు. రాధిక ప్రస్తుతం హనుమకొండ హంటర్ రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా రాధికను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత, అధ్యాపక బృందం అభినందించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

**- హసన్ పర్తి వద్ద బ్లాక్ స్పాట్స్ ను వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలన**



అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్–కరీంనగర్ ప్రధాన జాతీయ రహదారిలో హసన్ పర్తి పెద్దచెరువు కట్ట మూలమలుపు వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ శాఖలు సంయుక్తంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలో వరంగల్ – కరీంనగర్ మార్గంలో ఉన్న హసన్ పర్తి పెద్ద చెరువు కట్ట మూలమలుపు సమీపంలో తరచుగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణనష్టం సంభవిస్తున్న నేపథ్యంలో జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ, సాగునీటి పారుదల, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి ప్రమాదకరంగా ఉన్న బ్లాక్ స్పాట్స్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇటీవల హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హసన్ పర్తి పెద్ద చెరువు కట్ట మూలమలుపు వద్ద చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలు, జరుగుతున్న ప్రాణ నష్టంపై ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, సంబంధిత అధికారులకు తెలియజేయగా కలెక్టర్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, రోడ్డు విస్తరణకు ఉన్న అవకాశాలను ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ అక్కడికక్కడే సమీక్షించారు. నేషనల్ హై వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా వరంగల్ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, తహసీల్దార్ కిరణ్ కుమార్, పోలీస్ ఇన్స్పెక్టర్ చేరాలు , సాగునీటిపారుదల, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఇనుగుర్తిలో మెగా హెల్త్ క్యాంప్

**269 మందికి ఉచిత పరీక్షలు**

అక్షర దర్బార్, ఇనుగుర్తి: ఇనుగుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన మెగా ఆరోగ్య శిబిరం విజయవంతమైంది. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 269 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి డాక్టర్ సురేష్ నేతృత్వంలో చిన్నపిల్లలు, ఎముకలు, కంటి, దంత, మహిళల ఆరోగ్యం, సాధారణ వైద్య విభాగాలకు చెందిన నిపుణులు రోగులను పరీక్షించారు. మాతా–శిశు సంరక్షణ, వృద్ధుల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేకంగా సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తమ్మడపల్లి కుమార్, ఎంపీడీవో పార్థసారథి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, హెచ్ఈఓ సుదర్శన్‌తో పాటు వైద్యులు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సంరక్షణ కోసం 5కే రన్

**- నగర మేయర్ గుండు సుధారాణి**

అక్షరదర్బార్, వరంగల్: ప్రజల్లో ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంపొందించేందుకు సోమవారం పోచమ్మ మైదాన్ నుంచి హనుమకొండ వేయిస్తంభాల ఆలయం వరకు 5కే పరుగుపందెం నిర్వహించారు. నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కలెక్టర్లు మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సురేష్ జోషి, బస్వరాజు కుమారస్వామి, జన్ను శిభారాణి, అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సీహెచ్ఎంఓ డా. రాజా రెడ్డి, సీహెచ్ఓ రమేష్, హనుమకొండ డీవైఎస్ఓ అశోక్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎంహెచ్ఓ డా. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.




## భూపాలపల్లిలో 5కే రన్

అక్షర దర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లిలో ప్రజాపాలన–ప్రగతి కార్యక్రమంలో భాగంగా సోమవారం 5కే పరుగుపందెం నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి పోచమ్మ గుడి వరకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ, ఆర్డీఓ హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి 99 రోజుల కార్యాచరణలో భాగంగా వివిధ శాఖల ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశుధ్యం వంటి రంగాల్లో కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915